క్లుప్తంగా

గోకుల షెడ్డులను సకాలంలో పూర్తి చేయాలి

కంచికచర్ల: పాడి రైతులకు మంజూరైన గోకుల షెడ్డులను త్వరితగతిన పూర్తిచేయాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ రమాదేవి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 34 మంది రైతులకు గోకులం షెడ్డులు మంజూరయ్యాయని వాటిలో 12 పూర్తయ్యాయని, మిగిలిన రైతులు సకాలంలో నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన గోకులం షెడ్డుల రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా వారి బ్యాంకు ఖాతాలో నగదు చెల్లించామన్నారు. రైతులు బహు వార్షిక పశుగ్రాసాల సాగు చేసుకోవచ్చని, 5 ఎకరాల భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు, 5 ఎకరాల భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అయితే పశుగ్రాసం సాగు కోసం రైతులు అప్లికేషన్ ఫారం, జాబ్‌కార్డు జిరాక్స్, పొలం 1బీ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్‌లు జత చేయాలన్నారు. వ్యక్తిగతంగా రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు సాగు చేసుకోవచ్చన్నారు. కూలీల వేతన ఖర్చు, మెటీరియల్ ఖర్చు, ప్రభుత్వమే భరిస్తుందని ఏపీఓ అన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎంఈవో–2 చిట్టిబాబు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో గురువారం పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గుర్తించి పేరెంట్స్ కమిటీకి తెలిపి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో సిలబస్‌లు పూర్తయ్యేలా చూడాలని సిలబస్ పూర్తి కాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల్లో పని చేసే పారిశుద్ధ్య సిబ్బందికి మంజూరైన పెండింగ్ వేతనాలను అందించినట్లు తెలిపారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వాహనాల పెండింగ్ చలానాలపై ప్రత్యేక డ్రైవ్



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు సూచనల మేరకు వాహనాల పెండింగ్ చలానాల వసూలుపై గురువారం నుంచి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పట్టణ ఎస్ఐ. జి.రాజు తెలిపారు. ఇప్పటి వరకు నెలల తరబడి చలానాలు పెండింగ్‌లో ఉన్న వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కోట్లలో వాహనాల చలానాలు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చలానాల నగదును కట్టిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ వాహనాల రూల్స్‌ను పాటించాలని, లేని పక్షంలో జరిమానాలు తప్పవని తెలిపారు. చింత లేని వాహనాల ప్రయాణం అంటే ప్రభుత్వం విధించిన నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా ఇంటికి చేరి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండటమేనన్నారు.

ఎత్తిపోతల పథకం మాజీ చైర్మన్ గోపయ్య మృతి



పెనుగంచిప్రోలు: మునేరు ఎత్తిపోతల పథకం మాజీ చైర్మన్ కాకాని గోపయ్య(54) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకాని హరి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పూట్ల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కాకాని స్రవంతి, శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయ మాజీ డైరెక్టర్ నంబూరి రవి, మామిడి అప్పారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

భూముల వివాదాలకు పరిష్కారం రెవెన్యూ సదస్సులు

వీరులపాడు(కంచికచర్ల): వీరులపాడు మండలం దొడ్డదేవరపాడు గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగిందని తహసీల్దార్ షేక్ హుస్సేన్ తెలిపారు. ఈ సదస్సులో భూ వివాదాలకు సంబంధించిన 5 అర్జీలు వచ్చాయని వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, వీఆర్వో, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నందిగామటౌన్: రాష్ట్ర స్థాయిలో బ్రాహ్మణ పురోహిత అర్చక క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించటం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి వారి ఆలయ సమీపంలోని ఖాళీ స్థలంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినా గెలిచినా సమానంగా తీసుకోవాలన్నారు. ముందుగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిట హరివిల్లులు...రంగవల్లులు

- ధనుర్మాసంలో ముగ్గులకు ప్రాధాన్యం
- సంప్రదాయాలను కొనసాగిస్తున్న యువతులు
- పెద్ద పండుగలో మహిళల భాగస్వామ్యమే ఎక్కువ



రంగవల్లి తీర్చిదిద్దుతున్న యువతి

పెనుగంచిప్రోలు: ధనుర్మాసంలో ఇళ్ల ముందు ముగ్గులు పెట్టటం తరతరాలుగా సంప్రదాయంగా వస్తోంది. సంక్రాంతి నెల పొడవునా ముగ్గులు పెట్టి, ముగ్గుల మధ్యలో గొబ్బిళ్లు పెడతారు. పెళ్లి కావాల్సిన యువతులు ఇళ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బిళ్లు పెట్టి పూజలు చేస్తే మంచి మొగుడు వస్తాడని ఆండాళ్ తల్లి పావన చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆలయాల్లో ఆండాళ్ అమ్మవారికి తెల్లవారు జామున మహిళలు ప్రత్యేక పూజలు చేస్తారు. భోగి రోజున గొబ్బెమ్మ ముగ్గు, సంక్రాంతి రోజున పూర్ణకుంభం, కనుమ రోజున రథం ముగ్గు వేయటం ఆనవాయితీగా వస్తోంది.

మారుతున్న పద్ధతులు...

చేతి వేళ్ల మధ్యలో నుంచి ముగ్గును జారవిడిచి చుక్కలు, గీతలతో ముగ్గులు వేయటం సాధారణ పద్ధతి. అయితే మారుతున్న కాలానికనుగుణంగా అనేక పద్ధతులు వచ్చాయి. ముగ్గు, రకరకాల రంగు పౌడర్లు, పెయింట్లు, బ్రష్‌లు, జల్లెడ ముగ్గు, డబ్బా ముగ్గు, అచ్చులు, స్టిక్కర్లు కొనుగోలు చేస్తున్నారు.

ముగ్గుల పోటీలు....

సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు సంఘాల వారు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. గ్రామాల్లో అయితే సీసీ రోడ్ల పైన, మట్టి రోడ్లపైన శుభ్రం చేసి పోటీలు నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో విశాలమైన మైదానాల్లో నిర్వహిస్తున్నారు. ముగ్గులను రకరకాల రంగులతో దిద్దటంతో పాటు సంక్రాంతి పండుగ ఉట్టిపడేటట్లు పాలు, పొంగళ్లు, చెరకు గడలు, పిండివంటలు, కూరగాయలు కనపడేటట్లు ముగ్గులు దిద్దుతున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా రంగులు అద్దటంతో పాటు ముగ్గుల కోసం నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవటం, దిన పత్రికలో వచ్చే ముగ్గులను నేర్చుకుంటున్నారు.



ముగ్గుల పోటీలో పాల్గొన్న యువతులు(ఫైల్)

ముగ్గులు వేయటంలో శాస్త్రీయ అంశాలెన్నో....

ముగ్గులు వేయటంలో అనేక శాస్త్రీయ అంశాలు చోటు చేసుకున్నాయి. ముగ్గులు వేసే సమయంలో శారీరక శ్రమ చేయటంతో వ్యాయామం చేసినట్లవుతుంది. దీంతో ఆరోగ్యం బాగుంటుంది. పరిసరాలు శుభ్ర పడటంతో పాటు అందంగా ఉంటాయి. బియ్యపు పిండితో ముగ్గులు వేయటం ద్వారా అనేక చిన్న జీవరాశులకు ఆహారం వేసినట్లే అనే భావన ఉంది. ముగ్గులు వేయటంతో మన సంస్కృతితో పాటు సైన్స్ కూడా ఉందని భావించవచ్చు.

మన సంస్కృతిలో భాగం



ముగ్గులు వేయటం మన సంస్కృతిలో భాగం. బియ్యపు ముగ్గులు వేయటం ద్వారా సైన్స్ పరంగా కూడా చాలా మంచిది. భారతీయ సంస్కృతి ఎంతో విలువైనది. సంక్రాంతి సందర్భంగా మహిళలు ముగ్గుల పోటీలకు ఎప్పుడూ ముందుంటారు.

–కల్లూరి పద్మావతి, పెనుగంచిప్రోలు

చిన్నప్పటి నుంచి ఇష్టం



ముగ్గులు అంటే చిన్నతనం నుంచి ఎంతో ఇష్టం. ప్రతి రోజు దినపత్రికల్లో వచ్చే ముగ్గులను ప్రాక్టీస్ చేసి ఇళ్ల ముందు వేస్తున్నాం. ముఖ్యంగా భోగి, సంక్రాంతి, కనుమ రోజు ఇంటి ముందు పెద్ద ముగ్గులు వేస్తాం. రకరకాల రంగులతో ముగ్గులు అద్ది గొబ్బిళ్లను పెట్టి పూజలు చేస్తాం.

–శంభంగి రమాదేవి, జగ్గయ్యపేట

కొత్తా సేవలు మరువలేనివి

చందర్లపాడు(నందిగామ టౌన్): టీడీపీ అభివృద్ధికి చందర్లపాడు మండలంలో కొత్తా వెంకట సాంబశివరావు అందించిన కృషి మరువలేనివని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. చందర్లపాడు గ్రామంలో గురువారం సాంబశివరావు సంస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సాంబశివరావు చిత్ర పటానికి నివాళులర్పించి నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంబశివరావు టీడీపీ మండల అధ్యక్షునిగా, ఏఎంసీ చైర్మన్‌గా అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

9న బహిరంగ వేలం

నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి ఏడు నుంచి 11 రోజుల పాటు జరగనున్న కల్యాణ మహోత్సవాలతో పాటు మహాశివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన పలు హక్కులకు సీల్డు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో గంగాధర్ తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో గురువారం ఆయన మాట్లాడుతూ మహోత్సవాలకు సంబంధించి పూజా సామగ్రి, విద్యుత్, పూల అలంకరణలు, షామియానా, కుర్చీలు, మైకులు, ఆలయానికి రంగులు వేసేందుకు సీల్డు టెండర్ కం బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఈ నెల తొమ్మిదిన మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ నిబంధనల మేరకు వేలం పాట జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని కోరారు.

ఉపాధి పథకంలో అవినీతి పర్వం

- పనులు చేయకపోయినా బిల్లుల చెల్లింపులు
- మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబీకులకు మస్టర్లు
- మున్నలూరు గ్రామంలో రూ.3లక్షల మేరకు అవినీతి



కంచికచర్ల మండలం మున్నలూరులో ఆగస్టు 31న వర్షం కురుస్తున్న దృశ్యం

కంచికచర్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు అధికారుల అండదండలతో నిధులను కాజేశారని ఆరోపణలు వినవస్తున్నాయి. పనులు చేయకపోయినా చేసినట్లు చూపించి బిల్లులు చేసుకున్నట్లు తెలుస్తోంది. పనులకు రాని వారికి కూడా మస్టర్‌లు వేసి వారి బ్యాంకు ఖాతాల్లో పడే సొమ్ములో వాటాలు తీసుకుంటున్నారు. మొత్తం మీద ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు, సంబంధిత అధికారులకు వరంగా మారింది.

మంచంపై నుంచి లేవలేని వారికి మస్టర్‌లు...

కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలో వర్షాకాలంలో ఉపాధి పనిచేసినట్లు మస్టర్‌లు వేసుకుని ప్రభుత్వ నిధులు కాజేశారు. మంచానికే పరిమితమైన వారికి కూడా మస్టర్‌లు వేసి నిధులు కాజేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆ గ్రామంలో ఎత్తిపోతల పథకం కాల్వలకు సాగునీరు సరఫరా అవుతున్నాయి. కాని ఆ గ్రామంలో ఉపాధి పనులు కూలీలతో చేయించామని అక్కడ మేట్ సంబంధిత అధికారులతో కుమ్మక్కై నిధులు డ్రా చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో సుమారు రూ.3లక్షల మేరకు అవినీతి జరిగిందని గ్రామానికి చెందిన పలువురు సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. జూలై నుంచి నవంబర్ 22వ తేదీ వరకు లిఫ్టు ఇరిగేషన్ నుంచి సాగునీరు విడుదల అయ్యాయి. ఆ రోజుల్లో కూడా ఉపాధి పనులు జరిగినట్లు మస్టర్‌లు వేసుకుని డబ్బులు కాజేశారని గ్రామానికి చెందిన కూటమి నాయకుడు సూర్యదేవర రాము అన్నారు.

తూతూ మంత్రంగా విచారణ...

మున్నలూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఎంపీడీఓకి గ్రామస్తులు అర్జీలు పెట్టుకున్నారు. కాని ఎంపీడీఓ ఏపీఓను గ్రామానికి పంపించి మస్టర్‌ల లిస్టును కూడా చూడకుండా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండా తూతూ మంత్రంగా విచారణ చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కూడా లేకుండా మేట్‌తో మస్టర్‌లు వేయించి ఉపాధి పనులు చేపట్టారని సమాచారం. ఏది ఏమైనా గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై, పనిచేయని వారికి మస్టర్లు వేసిన ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ జరపాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.



ఆగస్టు 31వ వర్షం కురిస్తే ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ వేసిన మస్టర్ లిస్టు

పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం

మున్నలూరు గ్రామంలో ఉపాధి పథకం పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేశారని, వర్షాకాలంలో ఉపాధి హామీ పథకం పనులు చేసినట్టుగా బిల్లుల చెల్లింపుల గురించి గ్రామస్తులు నా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఏపీఓను గ్రామానికి పంపించి విచారణ జరిపిస్తాం. విచారణలో అవినీతి జరిగితే మేట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం.

– టీఎం విజయలక్ష్మి, ఎంపీడీఓ, కంచికచర్ల

ఇస్లాం 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

జగ్గయ్యపేటఅర్బన్: ఇస్లాం 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని కోదాడ రోడ్‌లో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇస్లాం మతానికి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పలువురు నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశంలో లౌకిక రాజ్యాంగం (సెక్యులర్) అమలులో ఉందన్నారు. అన్ని మతాల వారు వారి వారి మతాలకు చెందిన దేవుళ్లను పూజిస్తూ, ఇతర మతాలను కూడా గౌరవించే విధంగా సమాన హక్కు కలిగి భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్నామన్నారు. అనగా విభిన్నమైన మతాలు, కులాలు, జాతులు ఉన్నప్పటికీ భరత జాతి అనే ఏకత్వంతో ఐక్యంగా ఉంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, ముస్లిం పెద్దలు మౌలాలి, రామతి, రియాజ్, సమీర్ పాల్గొన్నారు.



పేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇస్లాం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

ఫెన్సింగ్ పోటీల్లో ఏకత్వ విద్యార్థుల హవా

వీరులపాడు(కంచికచర్ల): గత ఏడాది డిసెంబర్ 28, 29 తేదీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫెన్సింగ్ పోటీలలో ఏకత్వ పాఠశాల బాల బాలికలు పాల్గొని మంచి ప్రతిభ కనపర్చి పతకాలను కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయురాలు అడపా నాగసూర్యవతి తెలిపారు. కాంస్య పతకం సాధించిన విద్యార్థి మండల నౌరిష్ లక్ష్మీకార్తీక్‌ను గురువారం కళాశాల యాజమాన్యం అభినందించింది. జాతీయ స్థాయిలో ఉత్తరాఖండ్‌లో జరగబోయే ఫెన్సింగ్ పోటీలలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అమరనేని రమేష్‌బాబు ఫిజికల్ డైరెక్టర్ జి.విజయకుమార్, అకడమిక్ డైరెక్టర్ అమరనేని సింధూర తదితరులు పాల్గొన్నారు.



కాంస్య పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ రమేష్‌బాబు తదితరులు

ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలి

జగ్గయ్యపేటఅర్బన్: మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది కౌన్సిలర్లతో సమన్వయం చేసుకుని వార్డుల్లో అన్ని పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో గురువారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ సంక్రాంతి తరువాత అన్ని సచివాలయాల్లో అధికారులు, కౌన్సిలర్ల సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పేట పట్టణాన్ని స్వచ్ఛ జగ్గయ్యపేటగా తీర్చిదిద్దడానికి పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే ఎంపిక చేశారని, సంక్రాంతి తరువాత పనులు మొదలవుతాయన్నారు. ప్రజలు ఫిర్యాదులు చేయడానికి గ్రీవెన్స్ ఫోన్ నంబర్‌ను ఏర్పాటుచేశామని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆ ఫోన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి –వట్టెం మనోహర్

5 వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ మాట్లాడుతూ పట్టణ సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, తాగునీరు లేక, రేషన్ బండి అక్కడకు రాకపోవడం, కొందరికి నెలవారీ కరెంట్ బిల్లులు రాకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో రానున్న వేసవి కాలంలోపు పైపులైన్ల లీకేజీని అరికట్టాలన్నారు. పట్ట పగలు అనేక వార్డుల్లో వీధిలైట్లు వెలగడంతో ఎంతో విలువైన విద్యుత్ వృధాగా కాలిపోతున్నందున మూడవ తీగను ఏర్పాటుచేసి ఆ సమస్యను అరికట్టాలని కోరారు. సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు లేక ప్రజలు ఆధార్ కరెక్షన్ కోసం ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలతో ఎన్నికై, ప్రజా సమస్యలపై పోరాడే కౌన్సిలర్లకు ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది కనీస గౌరవం ఇవ్వడం లేదన్నారు. వీలైనంత త్వరగా 15 వ ఆర్థిక సంఘం నిధులు డీఎంఎస్ గ్రాండ్ ఎంపీ లాడ్స్, పలు రకాల నిధులు సేకరించి ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే తాతయ్య, చైర్మన్ రాఘవేంద్రకు సమస్యలు వెల్లడిస్తున్న మనోహర్

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టండి

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని జనసేన పార్టీ నాయకులు గురువారం పేట తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవికి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజుకు వినతిపత్రాలను అందజేశారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని కిషోర్‌కుమార్, జనసేన నాయకులు షౌకత్ ఆలీ, ఆవాల భవానీ ప్రసాద్, పోలంపల్లి బాలకోటి, పాటి సాంబ తదితరులు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈమని కిషోర్‌కుమార్ మాట్లాడుతూ గత ఆరు నెలలుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని కృషి చేస్తున్నారని తెలిపారు. కానీ పేట పట్టణంలో ఎండీయూ వెహికల్ ఆపరేటర్లు కొందరు ప్రైవేటు వ్యక్తుల ద్వారా పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారని, పోలీసు, రెవెన్యూ అధికారులు నిఘా వేసి అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన పార్టీ వారే కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీతో బియ్యం వ్యాపారం ఒప్పందాల కోసమే ఇదంతా చేస్తున్నారనే వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి.



పేట ఎస్ఐ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ క్యాలెండర్ ఆవిష్కరణ


భవానీపురం(విజయవాడపశ్చిమ): పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ వ్యాగన్ వర్క్‌షాప్ గుంటుపల్లి వారు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం గొల్లపూడిలో జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి షేక్ చాంద్ బాషా మాట్లాడుతూ పెన్షన్ అదాలత్‌లో ఇటీవల సీడబ్ల్యూఎం అంగీకరించిన సమస్యలకు త్వరలో పరిష్కారం లభించనుందని తెలిపారు. వ్యాగన్ వర్క్‌షాప్ సబ్ డివిజనల్ ఆసుపత్రి లోకల్ పర్చేజి మందుల విషయంలో స్థానిక డాక్టర్‌తో మాట్లాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ డెప్యూటీ సీఎంఈ ఎ.రామకృష్ణ, చైర్మన్ వీరాస్వామి, ట్రెజరర్ ఎం.శ్యాంబాబు, ఆఫీస్ బేరర్స్ కృష్ణారావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అకాడమీకి చెందిన గురువులు చింతా వెంకట శివరామకృష్ణ కుమార్ సారథ్యంలో 15 మంది కళాకారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణానికి చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. ఆలయ డీఈవో రత్నరాజు శిష్యబృందాన్ని అభినందించి దేవస్థానం తరఫున అమ్మవారి ప్రసాదాలు, ప్రశంసా పత్రాలను అందించారు.

బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ



వత్సవాయి: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి తెలిపారు. మండల కేంద్రం వత్సవాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఇంకా కొన్ని కార్యక్రమాలలో బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. అటువంటి వివాహాలు జరగడం వల్ల మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఆహారాన్ని తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏసీడీపీవో నాగమణి, ఎంపీడీవో రాంబాబు, హెచ్‌ఎం అశోక్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఆయుష్ వైద్యాధికారి ప్రియదర్శిని, అడ్వకేట్ మన్నేపల్లి బసవరాజు, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, పీడీ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.